# తిరోగామిని సరస్వతి

'అద్దం'

స్వామి పునశ్చరణానంద, పదిహేనేళ్ళపాటు ప్రాచ్య పాశ్చాత్య దేశాలు పర్యటించి, ఇటీవలే భారత దేశం వచ్చి ఆంధ్రదేశంలో దిగారు వారి ఆగమనాన్ని తెలుసుకొని, భక్తులూ శిష్యులూ, పూర్వాశ్రమంలో వారి స్నేహితు లనిపించుకొన్న వారూ ఒక్కొక్కరే వెళ్ళి దర్శనం చేసుకొంటున్నారు. నేనూ వెళ్ళాను. నమస్కారాలూ, కుశల ప్రశ్నలూ అయినాక, స్వామి, "ఏంచేస్తున్నారు ఇప్పుడు?" అన్నారు.

"ఎప్పట్లాగే; వారపత్రిక్కి సంపాదకుడుగా ఉంటున్నాను."

"బావుందా?"

"ఫరవాలేదండి. అరవై దాటింది. ఈ ఏడాది చివరికి ఎనభై కంటుతుంది. రెండేళ్ళలో—"

"ఏమిటా అంకెలు?"

"ఇంకేముంది, - సర్క్యులేషన్"

"అరవై ఏమిటి?"

"వేలు....!"

"ఓయబ్బో! అరవై వేలు.... తెలుగు వారపత్రిక అరవైవేలు పోతోందా?.... .... చాలా గొప్పగా ఉందే!.... మనం వెనక కలుసుకొన్నప్పుడు దాదాపు రెండువేలు గానో ఏమో ఉండేదికదూ!"

"అవునండి."

"కంగ్రాచులేషన్స్! మీకూ మీ పాఠకులకీ కూడా!"

"థేంక్స్ మీ మాటలు ఆశీర్వచనాలుగా స్వీకరిస్తున్నాను.... చాలా సంతోషంగా వుంది.... నా పత్రిక సర్క్యులేషన్ లక్ష దాటినంత ఆనందంగా వుంది.... కాని మీరు పాఠకులకి కంగ్రాచులేషన్స్ అన్నారెందుకు?"

"ఒక గొప్ప పత్రిక పాఠకులైనందుకు!"

"గొప్పదా?.... అంటే?"

మీ పత్రికలో వ్యాసాలూ కథలూ సామాన్య పాఠకులకికాక, కొంతఎత్తున వుంటాయి; అదీ నా ఉద్దేశం. సహజమైన అభిప్రాయాలు ధైర్యం పుణికిపుచ్చుకున్న శైలిలో వ్యక్తపరచబడి, పాఠకుల మనస్సుల్లో ఆలోచన్లు, చర్చలు రేకెత్తించేవిగా ఉండి, ఇన్నిటికీ మించి

క్లిష్టంగా ఉంటాయి. ఏదో అలా, అప్రామాణికంగా చదివే పాఠకులున్నారే. వాళ్ళకి సమస్యాంతంగా ఉండేవీ విమర్శనాత్మకంగా ఉండేవీ నచ్చవుకదా!........ అందుచేతనూ, అరవైవేల కాపీలు సర్క్యులేషన్ అని మీరు చెబుతున్నారు గనుకనూ అంతమంది ఇంతమంచి పత్రిక చదవటానికి తగిన ఉన్నతికి వచ్చారంటే, వాళ్ళనూ, వాళ్ళలో అంత ఎత్తుకి సంస్కారం, జ్ఞానం పెంపొందించిన మిమ్మల్నీ కంగ్రాచులేట్ చెయ్యకతప్పదు!"

నా స్థితి చాలా అయోమయంగా వుంది. గొప్ప ఇబ్బందిలో పడ్డాను. నేను పత్రిక అభివృద్ధికోసం ఒక రకం కృషి కొంత చేసినమాట నిజమేగాని, దాన్ని మెచ్చుకోవలసిన వాళ్ళు వేరు. ఆయన మెప్పుకి మాత్రం నా కృషి నిస్సంశయంగా అనర్హం. అది స్ఫురణకివచ్చి సిగ్గుపడ్డాను. సత్యం గ్రహించి చప్పగా చల్లారాను సాధారణంగా అలాంటి సమయాల్లో వస్తాను. అర్జంటు పనుందంటూ లేచి వెళ్ళిపోవడమే శరణ్యం. కాని ఇరవై ఏళ్ళనాడనగా కేవల వీరధారాగ్రతంతో జన్మించిన నా కలం నిర్దేశించిన బలంతో స్థిత్వం తెచ్చుకుని పలాయనం చిత్తగించక నా కూర్చొన్నాను. ఆయన మాటల్లో ఏ భావముంటే అది స్వీకరించడం, నా తరఫున సమాధానం చెప్పుకోడం నా కర్తవ్యం.

"స్వామీ! వ్యాపార ధర్మాన్ననుసరించి కొన్ని విషయాలదృష్ట్యా, నా పత్రికస్థాయి కొంత దించుకోక తప్పలేదు. అది మీకు నివేదించవలసిన బాధ్యత నామీద వుంది" అన్నాను.

"ఓహో! తెలిసింది. తప్పదు ఏంచేస్తాం?!.... ప్రపంచమే అలా వుంది నా విషయమే తీసుకోవచ్చు. సాధారణంగా ఆధ్యాత్మిక విషయాలు చర్చించేటప్పుడు, ఆత్మజ్ఞాన సాధనకే రాజమార్గమంటూ లేదని కర్కశంగా, నిష్కర్షగా చెప్తాను. ఉదాహరణలూ, పిట్టకధలూ చెప్పేపద్ధతి నాకు నచ్చదు. అవి విషయాన్ని మరపించి శ్రోతల్నిపక్కదార్లకి మళ్ళిస్తాయి.... అయితే, అప్పుడప్పుడు నేను నా కర్కశ ధోరణిపదలి, జిజ్ఞాసువుల సదుపాయంకోసం రెండు మూడు మెట్లు దిగవలసి వస్తూవుంటుంది...."

"కాని నా విషయంలో రెండు మూడు మెట్లుగాక ఇంకా ఎక్కువేమో"

"ఓ అలాగా మీ పాఠకులు మీకూ వాళ్ళకీ మధ్యవున్న ఇరవై మెట్లలో పదికన్నా ఎక్కలేం అంటారుగాబోలు. అప్పుడు మీరు మిగతా పదీ దిగిపోయి—"

'ఇంచుమించు అలాగే అనుకో... కాని నేను దిగిపోయేది మధ్యే మార్గాన్ని అధిగమించే—"

స్వామి పువ్వు విడినంత మెత్తగా నవ్వారు. 'ఓహో, పద్దెనిమిదీ రెండూ కాబోలు—?'

నేను సమాధానం చెప్పలేదు చెప్పవచ్చునేమోనన్న సందేహం లేదు నిట్టూర్పు విడిచాను. మనస్సులో ఆందోళన ఎక్కువవుతోంది మొహం తెల్లబడుతోందనుకుంటాను

"అయితే మీరు ఇరవైరెండు మెట్లు దిగిపోయి, పాఠకుల్నికూడా రెండు మెట్లు దించారా.... మీ జోలికైనా రాకుండా మొరాయించే పాఠకుల్నికూడా అంటుకోటానికి అంతలా దిగజారిపోయారా? ఏమిటి అన్యాయం? ఎందుకీ ఘోరపతనం?'

'ఎలాగో ఒకలాగ నా పత్రిక మిగతా పత్రికలమధ్య పోటీలో నిలబడాలి కదా; బతకాలి కదా; పెరగాలి కదా'

'ఎందుకు?'

'ఎం....దు....కా....?'

"అదే! అంతగా నిలబడి, బతికి, పెరగటం అంత అవసరమా అని?"

'అదేమన్నమాట స్వామీ!— ఎదగాలనీ, వృద్ధిలోకి రావాలనీ ఎవరు మాత్రం ప్రయత్నించరు!'

'అదే, అంత అవసరమా అని, తప్పదా అని అడుగుతున్నాను.... మీ విధి మీరు సక్రమంగా నిర్వర్తించుకుంటూ, మీ ఆదర్శం దెబ్బతినకుండా చూసుకోవలసిన బాధ్యత మీమీద లేదా?'

'స్వామి అంటున్నదేమిటో నాకర్థం గావడం లేదు. మా అభివృద్ధిని దొంగనోట్లద్వారా ద్రవ్యోల్బణం ప్రవేశపెట్టిన రీతిని తమరు గౌరవిస్తున్నట్లుంది.... ఆ రోజుల్లో మాలో కొందరు ఆదర్శంకోసం నిర్విరామంగా పనిచేశాం. డబ్బు కిట్టుబాటుగాక పస్తులున్న సంగతి స్వామికి తెలుసు ఇప్పుడు మేం యింకో మార్గంలో కృషిచేస్తున్నాం; ఏదో కొంత సుఖంగా వుంటున్నాం. పాఠకులు తీరిగ్గా వున్నప్పుడు ఏదో విధంగా వాళ్ళని ఆహ్లాదపరచటం, వాళ్ళలో 'చదవటానికి' ఒకతృష్ణను మేల్కొల్పటం; వాళ్ళు చదివితీరాలన్న కర్తవ్యబోధ వాళ్ళు గ్రహించకుండా తియ్యతియ్యగా నచ్చజెప్పటం; ఇవీ ఇప్పటి కార్యక్రమాలు. 'ఉత్తమతరగతి పత్రికలం మేం,' అంటూ దూరంగావుండి వాళ్ళ జేబులు కొట్టేసి వాళ్ళ మొహాలమీద పత్రిక విసిరికొట్టటం గాదు, ఇది."

నే నిలా చెబుతున్నంతసేపూ స్వామి తన ఎడంచేతివేళ్ళు తెరచివుంచి వాటివేపు సాలోచనగా చూస్తున్నారు. ఏమిటి అలా చూసుకుంటున్నారు, వాటికేమైనా అయిందా, అన్నాను.

'అబ్బే, ఏంలేదు....' తెరచివుంచినవేళ్ళమీదుగా కుడిచేతిచూపుడు వేలుని తాకించారు, స్వామి. 'మీరు మాట్లాడాతే, ప్రతి వాక్యమూ కొన్ని విభిన్నమైన ప్రశ్నల్ని వుత్పన్నం చేసింది!' అన్నారు.

'అంత ఆలోచన రేకెత్తించేటట్లుగా మాట్లాడానా?' అన్నాను; చిన్నగా నవ్వి.

స్వామికూడా నవ్వు కలిపారు. 'అదేకదా, విశ్వనాథం, నేను మీ లాంటి వాళ్ళనుంచి ఎప్పుడూ కోరేది!.... కాని ఇప్పుడు ఈ చేతికి ఇంకా కొన్ని వేళ్ళుఉంటే బాగుండునేమో అనిపిస్తోంది!'

'మీకు కలిగిన ఆలోచనలేమిటో అడగవచ్చా?'

'చెప్పటానికి, మళ్ళీ వాటిని వర్ణించటానికీ కొంతటైం పట్టొచ్చు చర్చిస్తూవుంటే కొత్త ఆలోచనలు బయలుదేరవచ్చు'

"నేను కొంతసేపు కూర్చోగలను. మీకూ తీరికే ననుకుంటాను....కాని మీరు నామీద ఏమైనా శస్త్రచికిత్స తలపెట్టారేమో- ఎక్కువగా తెలియకుండేటట్లు చేయండి. సాధ్యమైనంత వరకు రక్తపాతంగాకుండాచూడండి" అన్నాను, చిన్నగా నవ్వి.

"—సరే; మీరు వస్తులు వడున్నాం, అన్నారు. ఈ ఆకలి, రసతృష్ణా, లేక అన్నక్షుధా? క్షుద్బాధా విముక్తులు కావడంలో తరగతులున్నాయి అన్నమూ నీరూ ఉప్పుతో తృప్తిచెందవచ్చు.... .... .... కొద్దిగా కారం పులుసు ఉంటే బాగుంటుందనిపించొచ్చు.... .... పప్పు, కూర, (లేదా రెండూ) కావాలనిపించొచ్చు .... .... ఇలా ఒకటిపొందాక ఇంకోటి పొందుదామనే కోరికజనిస్తుంది

"మీరు, ఏదో అభివృద్ధిలోకి రావటం - పెరగటం - అన్నారు. (దీన్నిగురించి మన అభిప్రాయాలు ఒకటవునో కాదో చెప్పటం కష్టం-) రెండు వేలమంది చందాదారుల్లో, సుమారు రెండువందలమంది సరైన సంస్కారంలేక జారిపోతారనుకోండి దాంట్లో నష్టం లేదంటాను నేను.... నేనే ఒక సంగీత విద్వాంసుణ్ణయితే ఒక రసహీనుడైన లక్షాధికారి ఆనందంకోసం పాడటంకంటె కొద్దిమంది ధనహీనులైన రసజ్ఞుల సమక్షంలో పాడటం గొప్పగా భావిస్తాను. ఇదే మీ 'పెరగటం' విషయంలో వర్తిస్తుందేమో .... .... ఆదర్శాలు అధోముఖంగానూ, అమ్మకాలు ఊర్ధ్వముఖంగానూ చూపే మీ గణాంక రేఖలు దేనికి నిదర్శనాలు, ప్రగతికా, తిరోగతికా?.... ....

"మీరు దొంగనోట్లు తయారు చెయ్యటం - అని ఏదో అన్నారు. - ప్రభుత్వం, తగినంత అర్థిక వనరు, నిక్షేపం - లేకుండా నిరాధారంగా నోట్లు ముద్రిస్తే అవి చెత్తకాగితాల్తో సమానం. అట్లాగే సహజమైన

సంస్కృతి, సరైన ఆవేశం పునాదులుగా లేకుండా చేసే రచనకూడా. ఈ రెండు రకాల చెత్తా నన్నీ స్వీకరిస్తే అది ఆ ప్రజల మౌఢ్యాన్నీ ఆలోచనా శూన్యత్వాన్నీ తెలియజేస్తుంది మూఢులదగ్గరా, ఆలోచనా హీనులదగ్గరా డబ్బు పోగుచేసుకొని దానితల బాగుపడటం మంచిదేనా? పాఠకులు ఇష్టపూర్వకంగా మీ పత్రిక కొంటున్నారు. కొనరూ మరి! వెనక జనమేజయుడు సర్పయాగం చేసినప్పుడు మంత్రశక్తిచేత ఆకర్షించబడి సర్పాలు తమంతట తామే యాగాగ్నిలో దూర దూరాల్నించొచ్చి దూకినట్లు కొందరు, మిగిలినవాళ్ళు మీరు రేకెత్తించిన చదివితీరాలనే తృష్ణలో ఆ వ్యసనంలో పడి, ఇట్లా కొంటున్నారు, పత్రికలు.... ....”

స్వామి పునశ్చరణానంద ఇట్లా అన్నీ విప్పి చెప్తూవుంటే నేను విచలితుడ నయ్యాను అయినా “పత్రికలు చవగ్గా అమ్ముకోవాలంటే కాస్త ఎక్కువ అమ్ముడు పోయినప్పుడే కదా, సాధ్యం!” అన్నాను

ఒక వెయ్యి - అయిదువేలుమధ్య అయితే మీరు చెప్పేది నిజం. కాని ఆపైన సర్క్యులేషన్ పెంచటానికి చేసే ప్రతి ప్రయత్నం వెనుకా, కొన్ని ఇతర విషయాలు ప్రాముఖ్యం వహిస్తాయి. వాట్ని పరిష్కరించటానికి ఖర్చుచేసే మేధాశక్తి-”

“అదంతా మేనేజర్ సమస్యకదా!”

స్వామి మందహాసం చేసేరు. “అసలు మేనేజరే ఒక పెద్ద సమస్య అంటాను. మీరు అదర్శాలవైపు ఒక యెత్తు మొగ్గితే ఆయన సర్క్యులేషన్‌వైపు ఇరవైఎత్తులు మొగ్గుతాడు. పైగా సర్క్యులేషన్ పెరిగినకొద్దీ జీతాలు పెంచుతారుకదా అనే దృష్టి వుంటుంది.”

“ఎక్కువ సర్క్యులేషన్ లేకుంటే మంచి ఎడ్వర్టైజుమెంట్లు రావు కదా!”

“మంచి ఎడ్వర్టైజుమెంట్లు, వాటిమీద వచ్చే నికరాదాయం యివి ముందుగానే లెక్క చూసుకోకుండా ప్రగతికి పునాది వెయ్యలేరు. .... .... అయ్యా ఎడిటరుగారూ! ఇటీవల మనం ప్రచురిస్తున్న కథల్లో సమస్యాతీవ్రతలూ, వాటిమీద చర్చలూ అవీ ఎక్కువగా ఉంటున్నాయి. మన పాఠకుల్లో

ఎక్కువవుతుంది మహిళలు కదా. వాళ్ళకి ఏదో అలా, మామూలుగా జీవితంలాగా ఉండే కథలు సెంటిమెంట్ కథలూ సుఖాంతంగా ఉండేవి ఇష్టం. అందుచేత కాస్త ఆ జోర్ తగ్గించితే సర్క్యులేషన్ పడిపోకుండా ఉంటుంది; కొన్ని కాంట్రాక్టులు రెన్యూ అవుతాయి మంచి ఖాతాదార్లు ఒకసారి జారిపోతే మళ్ళీ చేజిక్కటం కష్టంకదా, ఆలోచించండిసార్ -" అంటాడు మా ఎడ్వర్టయిజ్‌మెంట్ మేనేజరు. అది విని మీరు మీ పద్ధతి మార్చుకోవలసి వస్తుంది." అన్నారు స్వామి, మళ్ళీ ఎడంచేతివేళ్ళు తెరుస్తూ.

"చెప్పండి." అన్నాను చిరునవ్వు తెచ్చిపెట్టుకుని "అ[illegible]వేళ్ళు మళ్ళీ ఏమంటున్నాయి?"

స్వామి నవ్వి అన్నారు. "- అది సరేగాని, ఈ ఆడవాళ్ళకి డెబ్బై పేజీల అచ్చుపుస్తకం ఒక వారంలో చదివిపారెయ్యటానికి ఎట్లా వీలవుతోంది?"

"ఓ, అదా!.... ... అయితే మీకు ఉన్న సంగతి చెప్పవలసిందే. ఒక వారంలో, ఒక్క పుస్తకంగాదండి; మూడు నాలుగు వారపత్రికలు, ఒక నెలలో నాలుగైదు మాసపత్రికలు, కొని, అద్దెకితెచ్చి, ఎరువుతెచ్చి, మార్పిడికితెచ్చి చదువుతారు. ఇవి కాక, ఆదివారం సప్లిమెంట్లు చదువుతారు ఇహ దీపావళి, ఉగాది ఇలాంటి పండుగలొచ్చి ప్రత్యేక సంచికలు బైటపడితే అవన్నీ సంపాదించి చదవవలసిందే కదా!"

"అలాగా!.... .... మరి టైం ఎక్కడిదో?!"

రోజులు మారాయికదా! .... .... పూర్వం మా అమ్మా మా అమ్మా రోజుల్లో అయితే చెరువును చో, ఏటి నుంచో మంచినీళ్ళు, బావినుంచి వాడుకనీళ్ళూ తెచ్చుకోవాలి పిండి, రవ్వ విసురుకోవాలి. వెన్నకోసం పెరుగు చిలుకుతూ కూర్చోవాలి. పాలు పిండుకోవాలి — ఇలా వంద పన్లు ఉండేవి. ఇప్పుడన్నీ సులువైపోయాయికదా!"

"అయితే - ముందు తీరుబాటు చేసుకోడం; అనక ఆ తీరిక సమయాన్ని ఎట్లా వదలగొట్టుకోడమో తెలియక తికమక పడడమునా? — పని సులువైపోయినకొదీ, ఇట్లా తీరు

బాటును దుర్వినియోగం చేసేకొద్దీ. మానసిక ఆరోగ్యం దెబ్బ తింటం లేదూ?"

"అయితే, స్వామీ! చదవటం అంత చెడ్డ అలవాటంటారా?"

"మీ పత్రికల్లో వచ్చే రచనలు చూస్తున్నాంగా! మెదడుకు పని కల్పించకూడదు. చదివిన మరు క్షణం మరచిపోటానికి వీలుగా ఉండాలి ఎలాగో ఒకలాగ మనిషి ఆలోచనాశక్తికి లేశమైనా హాని లేకుండా అనంత భూతకాలంలోకి అనంత భవిష్యత్తులోంచి ఒక్కొక్కటిగా దినాలు దొర్లుకుపోవాలి అట్లా వ్యసనంగా చదువుకొంటూ పోవటం చెడ్డ అలవాటే. ఒక్క చదువుకు పోవటమేగాదు అన్ని వినోద, కాలక్షేప, సాధనాలూ వ్యసనాలుగానే వున్నాయి ఎవరు తీరిక చేసుకోగలరో వారు ఆ తీరికను సద్వినియోగం చేసుకోగలరు; మానవ జీవితానికి ఉత్కృష్టతను సాధించగలరు అనే ఉద్దేశంతో, తీరిక ప్రగతికి మార్గం అన్నారు కాని ఇట్లా మంచి వేషం వేసుకొన్న వ్యసనాల్తో తీరికను దుర్వినియోగం చేసుకోటం మానవాళికి ఆరోగ్యకరం గాదు." స్వామి సానుభూతితో విచారకరంగా చూచారు.

"మరి తమరు అమెరికా వెళ్ళి అక్కడి పత్రికలు చూచేవుంటారే. అక్కడి ఆదివారం సప్లిమెంటు మన వాటికన్నా పది రెట్లెక్కువ పేజీలతో వుంటాయి; మనవాటికి ఇరవైరెట్ల సర్క్యులేషన్ ఉంటుంది; పైగా అక్కడి జనాభా మన జనాభాకంటె బాగా తక్కువ;- తమరు గమనించ లేదా స్వామీ?"

"వార్తాపత్రిక చదువుతూవుంటే అమృతసర్‌లోనో ఎక్కడో కలరా తగిలింది అని కనబడిందనుకోండి. అయ్యో పాపం, అని తరవాతి ఐటమ్ చూస్తాం. అదే మనం ఉన్న ఊళ్ళో అని వుందనుకోండి; ఇంకా కొంచెం పట్టించుకొని చదువుతాం. - ఈ ఆలోచనాతీవ్రత మళ్ళీ వ్యక్తినిబట్టి మారుతుందనుకోండి -'

"అంటే సాపేక్ష ధర్మం అన్న మాట. అయితే స్వామీ- .... .... నన్నిప్పు డేమిచేయమంటారు?"

"మిమ్మల్ని, చేస్తున్నది మాని ఇంకొకటేదో చెయ్యమనటానికి నే నంత ప్రపంచమార్గం తెలియని వాడనా?"

నేను నవ్వాను. "మీకు ప్రపంచ మార్గం తెలియ దనుకోండి అప్పుడు ఏం సలహా యిస్తారో - ?"

స్వామి కొంచెంసేపు ఆలోచనా నిమగ్నులయ్యారు.... ...."అచ్చులో వచ్చేదంతా చదవటం సుళువు. అక్కడ ప్రారంభమైన ఈవ్యసనం, అచ్చులో వచ్చేదంతా చదవగల్గి తేనే సంస్కారం అన్నంతదూరం వచ్చి అబగా తయారైంది; జనంలో ఇది ఎలా వుందంటే— ఒక ఆవు దొంగతనంగా ఒక చేనిలో దిగింది ఎవరైనా చూస్తే చావబాదుతారని భయంవల్ల త్వరత్వరగా తినగలిగి నంతకంటె కొన్నిరెట్లు ఎక్కువగా తినేసింది దాన్ని అంతటినీ అరి గించటానికి కావలసినంత జఠర రసం సమయానికి తయారుగాలేదు. పొట్ట ఉబ్బింది నెమరు వేసుకో టానికి ఓపిక చాల్లేదు. కొన్ని గం టల్లో చనిపోయింది తరువాత, చివరికి కసాయివాడు కోశాక, కడు పులో పేరుకుపోయిన ఈ చెత్త అం మైలు దూరానికి వాసనకొట్టింది మనపాఠకుల్లో చాలామంది నెమరు వేసుకోటానికి తీరికలేని పశువుల్లా తయారయ్యారు. ఈ చెత్తవల్ల తరు వాత వచ్చే దుర్వాసనని ముందు తరం వాళ్ళు భరించలేరేమోనని నాకు భయంగా వుంది.... .... ....

"నన్నడిగితే, ఒక మంచి పక్ష పత్రిక చాలు. దానికోసం ఆతృ తగా ఎదురుచూచేటంత గొప్పగా ఉండాలి. రకరకాల అభిరుచుల్ని పోషిస్తూ, నిండుతనం వొలికించే కొన్నికథానికలు,వ్యాసాలు,పద్యాలు అందులో వుండాలి. నచ్చిందేదో మళ్ళీమళ్ళీ చదువుకొనే తీరికా సహృదయులమధ్య దాని విషయం చర్చలు జరిపే అవకాశం ఉండాలి సంవత్సరానికి ఒకటో రెండో మంచి నవలలూ, నాటకాలూ రావాలి పేడకుప్పమీద మెరిసే మిణుగురు పురుగుల్లా అదృష్ట సృష్టికాకుండా ప్రయత్నపూర్వకమైన ఉత్తమ సృష్టిగా ఉండాలి. రెండేసి మూడే సేళ్ళకోసారి చదువుకుందా మనిపిం చేవిగా ఉండి, యాభై అరవై సంవ త్సరాలు పాఠక హృదయాల్లో పీఠం వేసుకొనేవిగా ఉండాలి.... ...."

తెలిసిందంటి.... .... .... నేను మాట్లాడినప్పుడు తమ చేతివేళ్ళు విచ్చుకున్నట్లే తమరు మాట్లాడు తున్నప్పుడు నా మనస్సులో కూడా సందేహాలు లేచాయి.

అదలా వుంచండి. సాహిత్యోల్బణాన్ని చట్టంచేసి నవరించలేం కదా దీనికి ఇతరమార్గాలేవో సెలవిస్తారా;

"నింపాదిగా పనిచేసే ఔషధం వొకటి విద్యా శాఖచేతుల్లో వుంది. కాని దురదృష్టవశాత్తు ఆశాఖను కూడా చాలావరకు ఈజబ్బుతో బాధపడేవాళ్ళే నిర్వహిస్తున్నారు. రెండోది-పాఠకులే ఈ సాహిత్యోల్బణాన్ని శస్త్రచికిత్సద్వారా అరికట్టాలి అది అసాధ్యమైపోయింది. మూడోది—ఈ డబ్బు ఒకనాడు హఠాత్తుగా పగిలిపోవటమే -చివరికి అదే జరుగుతుందనుకొంటాను అప్పుడు సాహిత్యం ముఖంమీద పెద్ద వికారమైన గాటు పడుతుంది........

"ప్రస్తుతం నా తక్షణ కర్తవ్యం;

"ప్రత్యేకం ఏమీ లేదు అలా ఎవరిపని వాళ్ళు చేసుకుంటూ పోండి ఒకవేళ అలాగయినా పాఠకుల్లో విసుగు పుట్టొచ్చేమో!

"చూద్దాం స్వామీ. తమరు సెలవిచ్చినట్లు ఒక ద్రావకం ఏర్పడింది, ఈ ద్రావకంలో నీళ్ళు ఇగిరిపోయినాక ఏవో గడ్డలు బైటపడతాయి. వాటి ఆకార గుణాల్ని అప్పుడు పరిశీలిద్దాం........ వెళ్ళి వస్తాను స్వామీ. తమ అమూల్యమైన అభిప్రాయాలు మరచిపోను-నమస్కారం।"

"నమస్కారం!"

FOR

BETTER

PRINTING

**Kasturi Press**

**28-15-3 Suryabagh,**

**VISAKHAPATNAM**